క్లుప్తంగా

పారదర్శకంగా ఇంటింటా ఓటరు సర్వే



ఎం.బెన్నవరంలో ఇంటింట సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాసనాయుడు

నాతవరం : ఈ నెల 21 నాటికి ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్ఎస్వీ శ్రీనివాసనాయుడు బీఎల్వోలకు సూచించారు. మండలంలోని ఎం.బెన్నవరం, ములగపూడి, నాతవరం గ్రామాల్లో ఆదివారం బీఎల్వోలు చేస్తున్న ఇంటింటా ఓటర్ సర్వేను ఆయన పరిశీలించారు. డిసెంబర్ 31 నాటికి 18 ఏళ్ల నిండిన వారిని ఓటర్లుగా చేర్చేందుకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇతర గ్రామాలకు శాశ్వతంగా వలస వెళ్లిన, డవుల్ ఎంట్రీ, మరణించిన వారి ఓట్లను తొలగించేందుకు వారి కుటుంబ సభ్యులకు నోటీసులను అందించి, తొలగింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని హెచ్చరిరంచారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



వరి నాట్లపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ దేవి

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొంతలం గ్రామంలో ఆదివారం సాగు పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి వరి నాట్లు వేయడంలో కుదువల పద్ధతి, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం వలన తెగుళ్ల నివారణ, పంటల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల కంటే, సేంద్రియ ఎరువుల ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు, సస్య రక్షణ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం స్థానిక సిబ్బంది సాంబమూర్తి, మోది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ వ్యాక్సిన్లు



పాడుగుపాలెంలో లంపీస్కిన్ వ్యాక్సిన్ వేస్తున్న సాయికుమార్

కె.కోటపాడు : లంపీస్కిన్ వ్యాధి బారిన తెలుగురంగు పశువులు పడకుండా ముందస్తుగా రైతులు తమ వద్దనున్న పశువులకు వ్యాధినిరోధక టీకాలను వేయించాలని ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ తెలిపారు. ఎ.కోడూరు, పాడుగుపాలెం గ్రామాల్లో ఆదివారం తెలుపురంగు జాతి ఆవులు, ఎద్దులకు లంపీస్కిన్ వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో 259 పశువులకు ఈ టీకాలను వేశారు. లంపీస్కిన్ వ్యాధిబారిన పడే పశువులకు శరీరమంతా దద్దుర్లు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం వస్తుందన్నారు. దీంతో పశువులు నీరసించి పోతాయని రైతులకు వివరించారు. దీన్ని నియంత్రించేందుకు ముందుగానే పశువులకు వ్యాధి నిరోధక టీకాలను తప్పక వేయించాలని సూచించారు.

చురుగ్గా ఓటరు సర్వే



మునగపాకలో ఓటరు సర్వే చేస్తున్న దృశ్యం

మునగపాక : మండల వ్యాప్తంగా ఓటరు సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆగస్టు 22లోగా ఓటరు సర్వే పూర్తిచేయాలన్న అదేశాలతో గ్రామాల్లో బీఎల్వోలు, బీఎల్ఏలు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదు అలాగే ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి ఇంటి యజమానులతో మాట్లాడి సవరణలు చేపడుతున్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మునగపాక 170 పోలింగ్ బూత్‌లో పీఎంసీ చైర్మన్ ఆడారి సంతోష్ కుమార్ సారథ్యంలో సర్వే చురుగ్గా సాగుతుంది.

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ

- రూ.30 లక్షలతో గొరిగెడ్డపై వంతెన
- రెండు గ్రామాలకు రహదారి సౌకర్యం



గొరిగెడ్డపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ రాంబాయి తదితరులు

మాడుగుల: మండలంలో కింతలి వల్లాపురం పంచాయతీ మధ్య నుంచి గొరిగెడ్డ ప్రవహిస్తుంది. కొద్దిపాటి వర్షం కురిసినా సరే గెడ్డ పొంగి ప్రవహిస్తుంది. ఇరువైపులున్న గ్రామాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి. 30 ఏళ్ల క్రితం రాకపోకలకు వీలుగా నడక దారి మేరకు చిన్న వంతెన నిర్మించారు. ప్రస్తుతం అది కూడా శిథిలమైపోయింది. బైక్‌లు, ట్రాక్టర్లు, నాలు బళ్లతో రైతులు వ్యవసాయ పంటలు తరలించే సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ గ్రామాలను పర్యటించేటపుడు ఈ సమస్యను తెలుసుకున్నారు. ప్రజల కోరిక మేరకు అక్కడే వంతెన నిర్మాణాన్ని చేపడతానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రూ.30 లక్షలు నిధులు కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కింతలి, కింతలి వల్లాపురం గ్రామ ప్రజల ఆనందానికి అంతే లేదు. మూడు దశాబ్దాలుగా తాము పడుతున్న ఇబ్బందులకు సీఎం జగన్ ప్రభుత్వంలో, డిప్యూటీ సీఎం బూడి చొరవతో పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణానికి నిధుల కేటాయింపు జరగడంతో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయిలు ఆదివారం శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. పనుల వేగవంతానికి పొక్లెయినర్‌ను పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి సోమన్నదొర, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాబు, ఉప సర్పంచ్ మట్టా గోవింద్, వైఎస్సార్సీపీ నాయకుడు బగుడు సీతారామయ్య, కాంట్రాక్టర్ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై జన విజ్ఞాన వేదిక పోరాటం



సభలో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర సాహిత్య విభాగం కన్వీనర్ యలమంద

మాడుగుల: నవ సమాజంలో ప్రజల్లో విజ్ఞానాన్ని పెంచి, వారిలో నెలకొన్న మూఢ నమ్మకాలను నియంత్రించడమే జన విజ్ఞాన వేదిక(జేవీవీ) లక్ష్యమని వేదిక సాహిత్య విభాగం రాష్ట్ర కన్వీనర్ యలమంద అన్నారు. ఆదివారం స్థానిక పాల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా మహాసభలో పాల్గొని, మాట్లాడారు. సైన్స్‌లో ఉన్న యాదార్థాన్ని ప్రజలు గమనించాలన్నారు. జేవీవీ నాస్తిక సంఘం కాదని, కేవలం సైన్స్, పర్యావరణం కోసం పనిచేస్తోందన్నారు. ప్రస్తుత సమాజంలో యువత పెడదోవ పడుతున్నారని, జేవీవీ కార్యక్రమాల ద్వారా వారిలో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ కోరారు. సమాజంలో దురాచారాలను అరికట్టి, విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రాలపై అవగాహన పెంచేందుకు జేవీవీ చేస్తున్న కృషిని మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.అప్పారావు, కార్యదర్శి రామ్ కుమార్, కళాశాల అధ్యాపకులు రామ్‌కుమారి, మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షుడు సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శి తాళ్లపురెడ్డి నాగ చంద్ర, కార్యదర్శి గౌరీపట్టపు మహేష్ కుమార్, కోశాధికారి చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



కె.జె.పురం చెరకు కాటా ఆవరణలోని నూకాంబికను పూజిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం, సాగరం కాలనీ, ఎం.కోటపాడు కాటా ప్రాంతాల్లో ఉన్న మోదమాంబ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఒడ్డు వండగ చేశారు. మెక్కులు తీర్చుకున్నారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం భజనలు చేశారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

కూరగాయల సాగులో మామిడి రైతులు



సూదివలసలో మామిడిలో అంతర పంటగా బరబాటి సాగు

కె.కోటపాడు: అంతర పంటల సాగుపై మండల గ్రామాల్లోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని మెట్ట ప్రాంతాల రైతులు ఎక్కువగా మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మామిడి పంటల కాపు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉంటుంది. అనంతరం ఈ మామిడి తోటల మధ్యనుండే ఖాళీ ప్రదేశాల్లో కూరగాయాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ కాల వ్యవధిలో పంట దిగుబడి వచ్చే కాయగూరల విక్రయాల ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. మిగిలిన తోట యజమానులు కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. దీంతో ఏడాదంతా ఆదాయం పొందేందుకు వీలవుతుందని తోట రైతులు చెప్తున్నారు. మండలంలోని పాతవలస, పింద్రంగి, మత్రివలస, గొట్లాం, సూదివలస, బొట్టవానిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లోని రైతులు మామిడి పంటలో అంతర పంటగా బరబాటి, బెండ, వంగతోట, టమాటా పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కాస్త నీటి వనరులున్న మరి కొందరు ఆకుకూరల్ని సాగు చూస్తూ వారం వారం రాబడి పొందుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం నిరసన నేడు



రోలుగుంటలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి

రోలుగుంట: ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాల అమలు, బడుగు బలహీన వర్గాలపై దాడుల నియంత్రణకు దళిత గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెళ్ల చిరంజీవి ఆదివారం తెలిపారు. రోలుగుంటలో ఆయన బడుగు, బలహీన, ఎస్టీ, ఎస్సీల సమస్యలపై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించినప్పటికీ, వారి అభివృద్ధికి ఖర్చు చేయట్లేదని ఆరోపించారు. వీటి అమలు కోరుతూ చేపట్టే నిరసనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలంతా పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు.

సీఎం జగన్ మహిళలకు అండగా ఉన్నారు..



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, అనేక సంక్షేమ పథకాలను మహిళలకే అందిస్తూ ఆర్థిక అండ కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించి సున్నా వడ్డీ నగదుపై చర్చించారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఎన్నో వనరులు అందిస్తూ ఆర్థిక స్వావలంబన పొందేందుకు తోడ్పడుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అయినా ఇలా మహిళల సంక్షేమం కోసం ఆలోచన చేసిందా అని అడిగారు. సీఎం జగన్ మీకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని, రానున్న ఎన్నికల్లో మీ ఓటుతో ఆయనకు కృతజ్ఞత తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్



పట్టుబడిన వారితో పోలీసులు

మాకవరపాలెం: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామిడిపాలెం శివారు తోటల్లో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సమీప గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.19,340 నదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

• నేల తల్లికి ఆకుపచ్చ సింగారం



కనుచూపు మేరలో కనిపించేదంతా లేత ఆకుపచ్చ రంగే. కురిసిన భారీ వర్షాలకు రైతులు పొలాలనన్నీ హలాల దున్ని.. దమ్ముపట్టి, నారు తీసి, నాట్లు వేశారు. దీంతో కాశీపురం నుంచి నాగయ్యపేటకు వెళ్లే రహదారిలో చుట్టూ ఎటు చూసినా వరి నాట్లు పూర్తి చేసుకున్న పొలాలతో పచ్చదనం కనువిందు చేస్తోంది. నేల తల్లి తన వంటికి ఆకుపచ్చ వన్నెలద్దుకుందా.. అన్నట్టు చూపుల్ని కట్టిపడేస్తోంది. ఆ దారి వెంబడి వెళ్లేవారు ఆగి మరీ.. ప్రకృతిని ఆస్వాదించి, తమ మొబైల్ ఫోన్లలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని ఆనందంగా వెళ్తున్నారు.

- దేవరాపల్లి

మాజీ సైనికుడికి సన్మానం



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఎర్రవరం,ఉప్పవరం గ్రామాల్లో నా దేశం – నా భూమి కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు కూనిసెట్టి రమణను సత్కరించారు. సకలా ఉమామహేశ్వర్, చిన్ని శ్రీనివాసరావు, పందల శ్రీను, సత్యారావు, పల్లె శ్రీను, అడపా మహాలక్ష్మి నాయుడు, సత్తిబాబు, ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

బారులు తీరిన బాతులు



శృంగవరంలో రోడ్డుపై తరలిస్తున్న బాతులు

నాతవరం : ప్రతీ ఏడాదిలానే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి బాతులను వాటి పెంపకందార్లు నాతవరం మండలానికి తీసుకువచ్చారు. ఖరీఫ్ కాలంలో తాండవ జలాశయం నీటి విడుదల తర్వాత ఆయా జిల్లాల నుంచి బాతులను పెంపకం కోసం వాటి యజమానులు తెస్తుంటారు. మండలంలో ఆదివారం శృంగవరం, ఎం.బి.పట్నం, గాంధీనగరం గ్రామాలకు వీటిని తెచ్చారు. దీంతో రోడ్డుపై బాతులు వందలాదిగా నడుస్తూ చూపరుల్ని ఆకట్టుకున్నాయి. తాండవ కాలువ నీరు పయనించే మార్గంలో ఈ బాతులు చేపలను, పంట పొలాల్లోని క్రిమికీటకాదులను ఆహారంగా తీసుకుంటాయి. వీటి ద్వారా పంటలకు ఎలాంటి నష్టం ఉండబోదని పెంపకందార్లు చెప్తున్నారు.

జగనన్న ప్రజా దీవెన సభకు తరలిన జనం



చోడవరం సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



తోటకూరపాలెం నుంచి బస్సులో బయలుదేరిన ఎంపీపీ రాజు తదితరులు



కొత్తకోట నుంచి తరలివెళ్తున్న జెడ్పీటీసీ సభ్యులు, ఇతర నాయకులు

రోలుగుంట: చోడవరం డిగ్రీ కళాశాల అవరణలో ఆదివారం నిర్వహించిన జగనన్న ప్రజా దీవెన బహిరంగ సభకు రోలుగుంట మండలం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పార్టీ జెండాను ఊపి జై జగనన్న...జైజై జగనన్న అంటూ ప్రజలతో కూడిన వాహనాలను ప్రారంభించి, తను కూడా అనుచరులతో కలిసి బయలుదేరారు. మండలం నుంచి సభకు తరలి వెళ్లిన వారిలో జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ మండల అధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు, సచివాలయ మండల కన్వీనర్ గొర్లె వెంకట రమణ, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సత్యన్నారాయణమూర్తి, గొర్లె చెల్లంనాయుడు, పోతల లక్ష్మీ శ్రీనివాసరావు, రోలుగుంట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మడ్డు తాతబాబు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉన్నారు.

రావికమతం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ఘన విజయం సందర్భంగా చోడవరంలో ఆదివారం నిర్వహించిన జగనన్న ప్రజాదీవెన సభకు రావికమతం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ పైల రాజు, ముఖ్యనాయకుడు రుత్తల బాపునాయుడు ఆధ్వర్యంలో తోటకూరపాలెం నుంచి కార్యకర్తలు, నాయకులతో బస్సులో తరలి వెళ్లగా, రావికమతం నుంచి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు ఆధ్వర్యంలో భారీగా నాయకులు బయలు దేరారు. జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, ముఖ్యనాయకులు పందల దేవా, శీలం శంకర్రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు డప్పుల, మేళాలతో కోలాహలంగా బస్సుల్లో బయలుదేరారు.

స్నేహ బంధం.. ఎంతో మధురం



పాతికేళ్ల తర్వాత కలుసుకున్న 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : వారంతా 1997–98లో కె.కోటపాడు హైస్కూల్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు. పాతికేళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్నారు. బాల్యంలో ఏర్పడిన స్నేహం గాఢత మళ్లీ వారిని దగ్గరకు చేర్చిందనడంలో అతిశయోక్తి లేదు. చదువుల వేటలో కొందరు, బతకు పోరులో మరి కొందరు తలోదారి వెతుకున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు, మరి కొందరు ప్రయివేట్/కార్పొరేట్ సంస్థల్లోనూ, ఇంకొందరు వ్యవసాయంలో బతుకును స్థిరపరచుకున్నారు. మళ్లీ ఇన్నేళ్లకు వారంతా ఆదివారం ఓ చోట కలుసుకున్నారు. ఇందుకు తమకు బతుకు బాట చూపిన పాఠశాల ఆవరణే వేదికయింది. పదో తరగతి పూర్తి చేసుకుని పాతికేళ్లయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తమ పాత మిత్రుల్ని కలుసుకుని, మనసారా పలకరించారు. ఒకరి కుటుంబం గురించి మరొకరు తెలుసుకుని, ఆనందించారు. పాతికేళ్లనాటి చిలిపి చేష్టలను మననం చేసుకుని సందడి చేశారు. అందులో ఇపుడు టెన్త్ దాటి చదువుతున్న పిల్లలున్న వారు కూడా కొందరున్నారు. తమ తల్లి/తండ్రి పదో తరగతి మిత్రులతో కలిసి చేస్తున్న సందడిలో ఈ పిల్లలూ భాగమయ్యారు. ఓ గొప్ప సంప్రదాయానికి, ఆనందానికి వారధులయ్యారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు పూర్వ విద్యార్థులు 110 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన పూర్వ విద్యార్థులు మామిడి కిషోర్, బండారు పేరునాయుడు, పట్నాల వెంకటలక్ష్మి, నీలి సూర్యనారాయణ, బొడ్డు అవతారం, ఏటూరి వెంకటేష్‌లను తోటి స్నేహితులు మనసారా అభినందించారు.

ఇంటింటా సమగ్ర ఓటరు సర్వే



ముకుందపురంలో ఇంటింటా ఓటరు సర్వే చేస్తున్న బీఎల్వోలు

మాడుగుల రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారు(బీఎల్వో)లు ఆదివారం కూడా ఇంటింటికీ వెళ్లి, సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 69 పోలింగ్ బూత్‌లలో బీఎల్వోల సారథ్యంలో కొత్త ఓటర్ల నమోదు, పాత ఓట్లలో సవరణలపై సర్వే చేపట్టారు. గత నెల 21 నుంచి ఈ సర్వే చేపట్టారు. ఈ నెల 21 నాటికి సర్వే పూర్తి చేయాల్సి ఉండటంతో సెలవు రోజులైనప్పటికీ, శని ఆదివారాల్లో కూడా సర్వేను నిర్వహించారు. మండలంలో ఆరుగురు సూపర్‌వైజర్లు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నట్లు ఎన్నికల సీనియర్ సహాయకుడు పూర్ణయ్య తెలిపారు. ఉప తహసీల్దారు పి.సత్యనారాయణ, ఆర్ఐలు నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు ఎప్పటికప్పుడు సర్వే తీరును పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూత్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణీ



దివ్యాంగులకు స్కూటీలను అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన 10 స్కూటీలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10వ తరగతి పాసై శారీరక అంగవైకల్యం కలిగి ద్విచక్ర వాహనాలు నడపగలిగిన వారికి అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 15 మంది దరఖాస్తు చేసుకోగా 13 మంది అర్హులుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వికలాంగ సంక్షేమ శాఖ ఏడీ జగదీశ్, ఎంపీడీవో కార్యాలయ ఏవో కృష్ణ, దేశంశెట్టి శంకర్‌రావు, నర్మాల కుమార్, కోన బుజ్జి, మళ్ల జయలక్ష్మి, విమలనాయుడు, లాలం శ్రీను, పిన్నమరాజు వాసు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన వచ్చింది.అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు గంగుపాం నాగేశ్వరరావు, గొర్ల వెంకటేశ్వరరావు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు.